సాక్షి ఖమ్మం

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



రామదాసు జయంతి ఉత్సవాలు..
కంచర్ల గోపన్న(రామదాసు) స్వస్థలమైన నేలకొండపల్లిలో ఆయన జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. IIలో



అవగాహనతో చెక్..
తలసేమియాపై అందరు అవగాహన కలిగి ఉండాలని ఖమ్మం జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్ సూచించారు. IIలో

గరిష్టం / కనిష్టం
35° / 17°

వాతావరణం
జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఖమ్మం డీసీసీబీకి వాట్సాప్ చానల్!

- రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) అధికారులు ఎప్పటికప్పుడు సాంకేతికత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఇందులో భాగంగా బ్యాంకు కార్యకలాపాలు, సేవల వివరాలు అందరికీ తెలియచేసేలా వాట్సాప్ చానల్ రూపొందించారు. బ్యాంకు సీఈఓ ఎస్.వెంకట్ ఆదిత్య ప్రత్యేక చొరవతో ఈ చానల్‌ను రూపొందించగా, ఈనెల రెండో వారంలో నిర్వహించే పాలకవర్గ సమావేశంలో ఆవిష్కరించనున్నారు. ఈ చానల్‌లో సభ్యులుగా చేరడం ద్వారా బ్యాంకు అమలుచేస్తున్న పథకాలు, రైతులు, వివిధ వర్గాలకు ఇచ్చే రుణాలు, డిపాజిట్లపై వడ్డీ రేట్ల వివరాలు, అర్హతలను తెలుసుకోవచ్చు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వాట్సాప్ చానల్ సిద్ధం చేయించిన సీఈఓ వెంకటఆదిత్యను బ్యాంకు అధికారులు, ఉద్యోగులు అభినందించారు.



డీసీసీబీ వాట్సాప్ చానల్ లోగో

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం


స్వామి పాదాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం, పల్లకీసేవ జరిపించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాలో ఆర్పీలకు పీఓఎస్ యంత్రాలు


పీఓఎస్ యంత్రాలు అందజేస్తున్న పీడీ

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీనిధి రుణాల వసూళ్లు, చెల్లింపుల కోసం మెప్మా ఆర్పీలకు పీఓఎస్ యంత్రాలను పీడీ మహేందర్ శనివారం అందజేశారు. జిల్లాలోని ఖమ్మం నగర పాలక సంస్థ, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీ పరిధిలో సమాఖ్యల బాధ్యులకు 20యంత్రాలను అందజేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు స్త్రీ నిధి రుణాలను చెల్లించే క్రమాన సమాఖ్య బాధ్యులు ఈ యంత్రాల సాయంతో అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్‌ఎం ఎస్.సుజాత, టీఎంసీ జీ.సుజాత, ఏడీఎంసీ వెంకటేశ్వర్లు, సీఓలు సల్మా, ద్రౌపది, ఉపేంద్రమ్మ, రోజా పాల్గొన్నారు.

సమగ్రంగా పంటల వివరాలు నమోదు


పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

రఘునాథపాలెం: జిల్లాలో సాగవుతున్న పంటల వివరాలను నమోదు చేసే పక్రియ సమగ్రంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య సూచించారు. రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో శనివారం ఆయన డిజిటల్ క్రాఫ్ బుకింగ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పంటలు విక్రయానికి ఏర్పాట్లు, మద్దతు ధర తదితర అంశాల్లో ఈ సర్వే కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఈనేపథ్యాన ఉద్యోగులు పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించి కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓలు పవన్, ప్రత్యూష, ఏఈఓ శిరిణ్మయి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు నిరాశే మిగిలింది..



కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనాలు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నేషనల్ హైవేలు, కొత్తగూడెం విమానాశ్రయంపై ప్రస్తావించలేదు. ఇటు జిల్లాకు, అటు రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం దురదృష్టకరం.
– రామసహాయం రఘురాంరెడ్డి, ఎంపీ, ఖమ్మం

తెలంగాణకు రిక్తహస్తం



రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎయిర్‌పోర్ట్‌లకు నిధులు కేటాయించకపోగా, నీటిపారుదల, రైల్వే రంగాల్లో కొత్త ప్రాజెక్టులేమీ ప్రకటించలేదు. అలాగే, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఊసెత్తలేదు.
– తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకు అనుకూలం



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకే కాక రైతులకు లబ్ధి చేకూర్చేలా ఉంది. జిల్లా ఆస్పత్రిలో డే కేర్ కేన్సర్ సెంటర్ ఏర్పాటుకానుంది. పాఠశాలలు, పీహెచ్‌సీల్లో బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుతాయి. 'ధన్‌ధాన్య కృషి యోజన'తో రైతులకు ఉపయోగం ఉంటుంది.
– గల్లా సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

పెట్టుబడులను ప్రోత్సహించాలి..



ఆదాయపు పన్ను స్లాబ్‌లు పెంచడం ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచేలా ఉంది. ప్రభుత్వపరంగా రాయితీలు ఇవ్వడం ప్రతీ బడ్జెట్‌లో జరిగేదే. అంతకు మించి కొత్తదనమేమీ లేదు. విప్లవాత్మక అభివృద్ధికి ప్రైవేట్ రంగంలోనూ పెట్టుబడులనూ ప్రోత్సహించాలి.
– ఈశ్వరప్రగడ హరిబాబు, హైకోర్టు అడ్వకేట్

ప్రత్యేకతలేమీ లేవు...



పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కొన్ని అంశాలతో వివిధ రంగాలకు చెందిన వారు సంతృప్తి వ్యక్తం చేస్తుండగా.. ఇంకొందరు మాత్రం అటు రాష్ట్రం, ఇటు జిల్లాకు కూడా ఎలాంటి ప్రయోజనం కలగలేదని పెదవి విరుస్తున్నారు. అంతే కాక బడ్జెట్ ఘనంగానే ఉన్నా అమలుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత రెండు బడ్జెట్లలో ఉద్యోగులు, మధ్య తరగతి వర్గాలకు నిరాశ ఎదురుకాగా.. ఈసారి మాత్రం ఆదాయ పన్ను పరిమితి పెంచడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం విశేషం. ఆయా అంశాల్లో దేశమంతటితో పాటు జిల్లాకు లబ్ధి జరగనుండగా.. జిల్లాకు ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం నిరాశను మిగిల్చినట్లయింది. ఇక్కడ యూనివర్సిటీని ఏర్పాటుచేయాలన్న ఏళ్ల నాటి డిమాండ్‌ను పట్టించుకోకపోగా.. సీతారామ ప్రాజెక్టుకు జాతీయ హోదాపైనా రిక్తహస్తమే చూపారు.
– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

1.20లక్షల మందికి లబ్ధి

ఆదాయపు పన్ను విషయమై కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు భారీ ఊరటనిచ్చారు. గతంలో ఉన్న స్లాబ్‌ల్లోనూ మార్పులు చేశారు. రూ.4లక్షల వరకు ఎలాంటి పన్ను లేకపోగా, రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు 5శాతం, రూ.8 లక్షల నుంచి 12 లక్షల వరకు 10శాతం, రూ.12 లక్షల నుంచి రూ.16లక్షల వరకు 15శాతం, రూ.16 లక్షల నుంచి 20 లక్షల వరకు 20శాతం, రూ.20 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25 శాతం చెల్లించాలి. ఇక ఆపైన ఆదాయం వచ్చే వారికి 30 శాతం పన్ను ఉంటుంది. అయితే, కొత్త పన్ను విధానంతో స్టాండర్డ్ డిడక్షన్‌తో రూ.12.75 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరముండదు. ఈ విధానంతో జిల్లాలో ఉన్న దాదాపు 1.20 లక్షల మంది పన్ను చెల్లింపుదారులకు ఊరట కలగనుంది. ఇక కొద్ది మొత్తంలో పన్ను చెల్లించేవారికి టీడీఎస్ విధానంతో మేలు చేకూరుతుందని భావిస్తున్నారు.

రంగాల వారీగా ఇలా...

- వైద్య రంగంలో డే కేర్ కేన్సర్ల ఏర్పాటులో భాగంగా జిల్లాకు సెంటర్ మంజూరు కానుంది.
- మెడికల్ సీట్ల పెంపుతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లోనూ మరింత మంది విద్యార్థులకు అవకాశం దక్కుతుంది.
- జిల్లాలో 1,216 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 83,296 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలకు మరింత వన్నెలద్దేలా బడ్జెట్ కేటాయించడంతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. అలాగే విద్యారంగంలో ఏఐని ప్రవేశపెట్టనుండడంతో ప్రభుత్వ విద్యార్థులకు డిజిటల్ శిక్షణ అందుతుంది.
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలు సైతం కొత్త హంగులను అద్దుకోనున్నాయి.
- వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అలాగే పండ్లు, కూరగాయల ఉత్పత్తి పెంచేలా నూతన పథకం, పత్తి ఉత్పాదక పెంపునకు జాతీయ స్థాయిలో ప్రత్యేక మిషన్ ఏర్పాటుతో జిల్లాలోని రైతులకు లబ్ధి జరగనుంది. ఈ పథకాల ద్వారా జిల్లాలోని 3.42 లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందనున్నారని తెలుస్తోంది.
- పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని నేలకొండపల్లిలో బౌద్ధక్షేత్రం, ఖమ్మంలో ఖిల్లా, లకారం ట్యాంక్‌బండ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో కనకగిరి గుట్టల అభివృద్ధికి నిధులు కేటాయించింది. ప్రస్తుతం కేంద్రం నిర్ణయంతో ఈ ప్రాంతాలకే కాక పులిగుండాలకు కూడా మహర్దశ పట్టనుంది.
- అసంఘటిత రంగాల ఉద్యోగులకు (గిగ్ వర్కర్లు) బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. వీరికి గుర్తింపుతోపాటు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించేలా ఈ–శ్రమ్ పోర్టర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ప్రధానమంత్రి ఆరోగ్య యోజన కింద ఉద్యోగి కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుతుంది. దీంతో జిల్లాలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మందికి మేలు చేకూరనుంది.
- పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని ప్రకటించారు. ఇందులో భాగంగా నేషనల్ మాన్యుఫాక్చరింగ్ మిషన్ ఏర్పాటు చేయనుండగా స్టార్టప్ కంపెనీలకు ఇచ్చే సాయం కూడా పెంచనున్నారు. సుమారు 27 రంగాల్లో ఈ పథకం అమలుకానుండగా జిల్లాలో సొంతంగా పరిశ్రమలు ప్రారంభించాలనుకునే వారికి చేయూత దక్కుతుంది. జిల్లాలో గ్రానైట్ ప్రధాన పరిశ్రమగా ఉన్న నేపథ్యాన రుణ సౌకర్యంతో మరింత అభివృద్ధి చెందనున్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో అందరితో పాటే మనకు..

- ఆదాయపు పన్ను పరిధి పెంపుతో వేతన జీవులకు ఊరట
- అంగన్‌వాడీ కేంద్రాలకు హంగులు, పాఠశాలల్లో ల్యాబ్‌లతో డిజిటల్ బోధన
- యూనివర్సిటీ, 'సీతారామ'కు జాతీయ హోదాపై నిరాశే
- ప్రస్తావనే లేని గూడెం ఎయిర్‌పోర్ట్, నూతన హైవేలు

బడ్జెట్ ప్రజోపయోగంగా లేదు...



బీజేపీ గతంలో మాదిరిగానే ఈసారి కూడా ప్రజోపయోగకరంగా బడ్జెట్ రూపొందించలేదు. రాజకీయ కోణంలోనే తప్ప సంస్కరణలను తీసుకురావడం లేదు. రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు లేకుండానే తూతూ మంత్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సరికాదు.
– పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

మనకు మొండిచేయే...



కార్పొరేట్, పెట్టుబడిదారీ వర్గాలను మెప్పించేలా బడ్జెట్ ఉంది. అధిక ధరలు, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయగలిగే ఏ నిర్ణయమూ లేదు. రానున్న ఎన్నికల దృష్ట్యా బిహార్‌కు వరాలు ప్రకటించి.. తెలంగాణ తదితర రాష్ట్రాలకు మొండి చేయి చూపించారు.
– పోటు రంగారావు, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి

పూర్తిగా సంపన్నుల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టింది సంపన్నుల బడ్జెట్. దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా ఉపాధి రంగాలను పూర్తిగా విస్మరించారు. దేశంలో 50 శాతానికి పైబడి వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండగా ఆ రంగంపైనా ఉదాసీన వైఖరి అవలంబించారు.
– బాగం హేమంతరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు

జిల్లాకు మొండిచేయి



విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు తగ్గించారు. కనీస మద్దతు ధరల చట్టం, గిట్టుబాటు ధరలపై హామీ ఇవ్వలేదు. విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, భద్రాచలం – కొవ్వూరు రైల్వేలైన్, జాతీయ రహదారుల ఊసే లేక జిల్లాకు అన్యాయం జరిగింది.
– నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

శతాబ్ది ఉత్సవాలకు వేళాయె...

- రేపటి నుంచి అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- వెల్లడించిన డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్


మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ్, పక్కన అధికారులు

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మంలో అటవీశాఖ కార్యాలయం నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ వెల్లడించారు. ఇందులో భాగంగానే సోమవారం నుంచి విద్యార్థులకు అటవీ ప్రాంతం, పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఖమ్మంలోని అటవీశాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీశాఖ కార్యాలయం 1925లో నిర్మించగా.. అప్పట్లో అతి పెద్దదైన ఖమ్మం అటవీశాఖ సర్కిల్ ద్వారానే తిరువూరు సర్కిల్ కార్యకలాపాలు సైతం కొనసాగేవని తెలిపారు.

'ఫారెస్ట్ విజిట్'కు విద్యార్థులు

జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా మెగా ప్రాజెక్టులకు రూపకల్పన జరుగుతోందని డీఎఫ్‌ఓ వెల్లడించారు. ఇప్పటికే జమలాపురంలో ఎకో పార్క్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారన్నారు. అలాగే, తల్లాడ రేంజ్ పరిధి కనకగిరి కొండల వద్ద పులిగుండాల ఎకో టూరిజంను ఫిబ్రవరి 15న ప్రాథమికంగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాగా, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వన దర్శిని పేరుతో రోజుకు 300 మంది చొప్పున సుమారు 7వేల మంది విద్యార్థులను అటవీ ప్రాంతం సందర్శనకు తీసుకెళ్తామన్నారు. కనకగిరి కొండల వద్ద పక్షులు, వన్యప్రాణుల సర్వే జరుగుతున్నందున వీటితో పాటు వృక్ష, జంతుజాతులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, జెడ్పీ సీఈఓ దీక్షా రైనాతో కలిసి పులిగుండాల ప్రాజెక్టును సందర్శించి అభివృద్ధి పనులపై చర్చించామని వెల్లడించారు. కాగా, శతాబ్ది ఉత్సవాల్లో సందర్భంగా ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న, రిటైర్డ్ అయిన ఉద్యోగులను భాగస్వాములను చేస్తామని డీఎఫ్‌ఓ తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీఓలు మంజుల, కృష్ణారావు, ఎఫ్‌ఆర్‌ఓలు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరిలో పిలక దశలోనే కంకులు

ఆందోళనలో రైతులు


వరి పైరును పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు, అధికారులతో రైతులు

రఘునాథపాలెం: వరి నాటిన 50 నుంచి 60 రోజుల్లో కంకులు రావాల్సి ఉండగా 30 రోజుల్లోనే రావడంతో దిగుబడిపై ప్రభావం పడనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రఘునాథపాలెం మండలం కోయచలక గ్రామానికి చెందిన పది మందికి పైగా రైతులు ఒక ప్రముఖ కంపెనీ విత్తనాలను 30కి పైగా ఎకరాల్లో నాటారు. అయితే, నాట్లు వేసి 30 – 40 రోజులే అవుతుండగా పైరు పూర్తిగా పెరగక ముందే పిలక దశలోనే పలచగా కంకులు వేశాయి. దీంతో ఆందోళనకు గురైన రైతులు విత్తన కంపెనీ ప్రతినిధులతో పాటు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు శనివారం కంపెనీ బృందంతో కలిసి ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈఓ కార్తీక్ రైతుల పొలాలను పరిశీలించారు. ముందే కంకులు వేయడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని, తద్వారా ఒక్కొక్కరు రూ.వేలల్లో పెట్టుబడి నష్టపోయే ప్రమాదముందని రైతులు వాపోయారు. ఈ విషయమై ఏఓ ఉమామహేశ్వర రెడ్డిని వివరణ కోరగా రైతులు సాగు చేసిన పొలాన్ని పరిశీలించామని తెలిపారు. బిల్లుల ఆధారంగా కంపెనీ దృష్టికి తీసుకెళ్లడమే కాక నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని వెల్లడించారు.

ప్రదర్శనలు, ప్రయోగాలతో విజ్ఞానం


ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంఅర్బన్: పాఠశాలల విద్యార్థులకు పాఠాల బోధనతో సరిపెట్టకుండా అందులోని అంశాల ఆధారంగా ప్రదర్శనలు ఏర్పాటుచేయడం, ప్రయోగాలు చేయించడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. ఖమ్మం ఇందిరానగర్ పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం 'శాస్త్రీయ అన్వేషణ–ఆవిష్కరణ' పేరిట సైన్స్ మోడళ్లు, ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్మైల్ ఫౌండేషన్, షెల్ ఇండియా సహకారంతో రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈఓ శైలజాలక్ష్మి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రావొద్దు


సబ్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఈ

చింతకాని: రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరగనున్న దృష్ట్యా అంతరాయాలు ఎదురుకాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఖమ్మం ఎస్‌ఈ సురేందర్ సూచించారు. మండలంలోని చింతకాని, కొదుమూరు, పందిళ్లపల్లి, నాగులవంచ సబ్‌స్టేషన్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ సబ్‌స్టేషన్లలో నిర్వహణ, మరమ్మతులు పూర్తిచేసి, అవసరమైన చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే రైతులు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలన్నారు. డీఈ నంబూరి రామారావు, ఏడీఈ తిలక్, ఏఈలు శ్రీధర్, ఉమామహేశ్వరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలతో కొత్త ఉత్తేజం, ఉత్సాహం



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, వేదికపై జిల్లా జడ్జి రాజగోపాల్ తదితరులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా
- ఖమ్మంలో మహిళా న్యాయవాదుల క్రీడాపోటీలు ప్రారంభం

ఖమ్మంలీగల్: అటు కేసులు, ఇటు కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమయ్యే మహిళా న్యాయవాదులు క్రీడలపై దృష్టి సారించి పోటీల్లో పాల్గొనడం ద్వారా కొత్త ఉత్తేజం, ఉత్సాహం సమకూరుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా పేర్కొన్నారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో తాళ్లూరి సాహస్ చౌదరి మెమోరియల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహిళా న్యాయవాదుల క్రీడాపోటీలను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు, వినోదాలు మానవ జీవితానికి అవసరమని, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తాయని తెలిపారు. అంతేకాక ఆటలతో సృజనాత్మక, నైపుణ్యం వెలుగులోకి వస్తాయని, మానవ సంబంధాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మూడేళ్లుగా మహిళా న్యాయవాదులకు రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న న్యాయవాది తాళ్లూరి దిలీప్‌ను అభినందించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ మాట్లాడగా జస్టిస్ నందా మహిళా న్యాయవాదులతో కలిసి సరదాగా కబడ్డీ, రింగ్, త్రోబాల్ ఆడి ఉత్సాహపరిచారు. కాగా, క్రీడాకారులకు ఇటీవల మృతిచెందిన న్యాయవాది చల్లా శంకర్ జ్ఞాపకార్థం టీ షర్ట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, ఎం.అర్చనాకుమారి, శ్రీనయ్య, బి.రాంప్రసాదరావు, కే.వీ.చంద్రశేఖరరావు, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, బిక్కం రజని, ఏపూరి బిందుప్రియ, శివరంజని, వినుకొండ మాధవి, బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ, ఫెడరేషన్ ఆఫ్ బార్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్‌తో పాటు దిరిశాల కృష్ణారావు, బిచ్చాల తిరుమలరావు, రావుల వెంకట్, లలిత తదితరులు పాల్గొన్నారు.


త్రోబాల్ సర్వీస్ చేస్తున్న జస్టిస్ నందా

ఎమ్మెల్యే ఇంట వాటర్ యాపిల్!

సత్తుపల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఇంటి ఆవరణలో కొన్నాళ్ల క్రితం నాటిన వాటర్ యాపిల్ చెట్టుకు గుత్తులుగా కాయలు కాశాయి. ఈ కాయలతో ఎమ్మెల్యే దంపతులు దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.


వాటర్ యాపిల్ కాయలతో రాగమయి దంపతులు

క్లుప్తంగా

ఉప కమిషనర్‌ను కలిసిన ప్రతినిధులు



సంధ్యారాణిని సన్మానించిన సంఘాల ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ వరంగల్ ప్రాంతీయ ఉప కమిషనర్‌గా ఇటీవల సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగ, అర్చక సంఘాల ప్రతినిధులు శనివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తోటకూర వెంకటేశ్వర్లు, మురళి, అర్చక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాములూరి వీరభద్రరావు, నరహరి రామకృష్ణ మాచార్యులుతో ఎస్‌పీ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొనగా ఆలయాల నిర్వహణపై ఉప కమిషనర్ పలు సూచనలు చేశారు.

వరద బిల్లులపై డీఎంఏ ఆరా

విజిలెన్స్ సైతం దృష్టి సారించినట్లు చర్చ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో గత ఏడాది సెప్టెంబర్‌లో వరదలు వచ్చిన సమయాన చేసిన పనులకు సంబంధించి బిల్లులపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్(డీఎంఏ) ఆరా తీసినట్లు తెలిసింది. ముంపు ప్రాంతాల ప్రజలకు భోజనాలు సమకూర్చడంతో పాటు ఇతర సహాయక చర్యలకు వెచ్చించిన నగదు కన్నా ఎక్కువ బిల్లులు చేసినట్లు కొందరు విజిలెన్స్ అధికారులకు లేఖ రాసినట్లు సమాచారం. దీంతో విజిలెన్స్ అధికారులు దృష్టి సారించగా, వరద బిల్లులపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కేఎంసీ అధికారులను డీఎంఏ ఆదేశించినట్లు తెలిసింది. కేఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు నాలుగు రోజుల క్రితం లేఖ రాగా, నివేదిక సిద్ధం చేస్తున్నారని సమాచారం.

రవాణా శాఖ ఏఓగా సుధాకర్

ఖమ్మంక్రైం: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అడ్మిస్ట్రేషన్ అధికారి (ఏఓ)గా మన్నె సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఏఓగా ఉన్న జహీద్‌అలీ ఉద్యోగ విరమణ చేయడంతో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌కు ఏఓగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, ఏఓ పోస్ట్ కోసం పలువురు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కాగా, ఉద్యోగ విరమణ చేసిన జహీద్‌అలీని ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ, ఎంవీఐలు వరప్రసాద్, శ్రీనివాసరావు, ఏఎంవీఐలు స్వర్ణలత, సుమలత, గోపీకృష్ణ, కృష్ణమోహన్, రిటైర్డ్ ఎంవీఐ ధన్‌రాజ్‌బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో కరాటే టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని వర్తకసంఘం భవన్‌లో ఆదివారం కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు మాస్టర్ గోపతి సైదులు తెలిపారు. అండర్–11 విభాగం నుంచి సీనియర్స్ విభాగాల వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కాగా, పోటీలను పోలీస్, ఎక్సైజ్ సీఐలు డి.రమేశ్, కె.సాంశివరావు, వై.సర్వేశ్వరరావు ప్రారంభిస్తారని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలకు డ్యూయల్ డెస్క్‌ల వితరణ



బెంచ్‌లతో దాతలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీక్లబ్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి, లక్ష్మి ఆధ్వర్యాన సత్తుపల్లి అయ్యగారిపేట ప్రాథమిక పాఠశాలకు శనివారం రూ.50 వేల విలువైన 12 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. పాఠశాల పరిస్థితులను ఉపాధ్యాయురాలు టి.కిరణ్మయి వారికి వివరించగా డెస్క్‌లు సమకూర్చారు. కార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం యాకోబు, పాఠశాల హెచ్‌ఎం ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కానిస్టేబుల్ ప్రతిభ



పతకం, ట్రోఫీతో ఉపేందర్

ముదిగొండ: ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న నేలమర్రి ఉపేందర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. పోలీసుల రాష్ట్రస్థాయి పోటీలు కరీంనగర్‌లో జరుగుతుండగా హ్యాండ్‌బాల్ జట్టులో ఉపేందర్ కీలకంగా వ్యవహరించాడు. ఈ మేరకు ఆయన జట్టు కాంస్య పతకం, ట్రోఫీ గెలుచుకోగా సీఐ మురళి, పోలీసు ఉద్యోగులు అభినందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

రామదాసు జయంతి ఉత్సవాలు ప్రారంభం



కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు



నేలకొండపల్లిలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

- మందిరంలో పూజలు.. నగర సంకీర్తన
- వివిధ ప్రాంతాల కళాకారులతో కచేరీ

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడైన కంచర్ల గోపన్న (భక్త రామదాసు) జయంతి ఉత్సవాలు నేలకొండపల్లిలోని ధ్యాన మందిరంలో శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను భద్రాచలం దేవస్థానం ఏఈఓ బి.రామకృష్ణ ప్రారంభించారు. అంతకు ముందు గోపూజ, మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆ తర్వాత భక్తులు నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆడిటోరియంలో రామదాసు సంకీర్తనలు, విష్ణు సహస్రనామ పారాయణ, సంగీత కచేరీ నిర్వహించారు. కాగా, ఉత్సవాలకు తొలిరోజు ఆశించిన స్థాయిలో భక్తులు రాకపోవడంతో నిర్వాహకులు నిరాశ చెందారు. జిల్లా, మండలస్థాయి అధికారులు సైతం ఒక్కరిద్దరే హాజరయ్యారు. ఈమేరకు నేలకొండపల్లికి చెందిన యువకులు మండల కేంద్రంలోని రామదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, విద్వత్ కళాపీఠం ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, వివిధ పార్టీల నాయకులు జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, మామిడి వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, మోర మల్లయ్య, సామాల కోటేశ్వరరావు, కడియాల నరేశ్, మాదాసు ఆదాం, సాయి నవీన్, బాబి, రాచకొండ అయ్యప్ప, పగిళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు నేలకొండపల్లిలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే రామదాసు జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత ఖమ్మం, అశ్వారావుపేట, వైరాలో జరిగే పలు కార్యక్రమాలకు మంత్రి హాజరుకానున్నారు.

మార్పులకనుగుణంగా బోధన అభినందనీయం

హార్వెస్ట్ వార్షికోత్సవంలో మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన డీఈఓ శర్మ, కరస్పాండెంట్ రవిమారుత్ తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: ఎప్పటికప్పుడు విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా హార్వెస్ట్ పాఠశాలలో బోధన కొనసాగిస్తుండటం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హార్వెస్ట్ పాఠశాల 23వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. మంత్రి తుమ్మలతోపాటు డీఈఓ సోమశేఖరశర్మ, హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలకు పైగా ఎందరో విద్యార్థులను ఉన్నతస్థాయికి చేర్చిన ఘనత ఈ పాఠశాల సొంతమన్నారు. డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడుతూ.. సైన్స్, సాంఘికశాస్త్రాలను వర్క్‌టూ లెర్న్ పద్ధతిలో బోధిస్తే విద్యార్థులకు జీవితకాలం గుర్తుంటాయని తెలిపారు. కరస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడుతూ.. ఒత్తిడిలేని విద్యనందిస్తూ బాల్యానికి భరోసా అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. చైర్మన్ డాక్టర్ నాగమణి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం, చక్కటి వసతులు ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకోగా ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహనతోనే తలసేమియాకు చెక్



ర్యాలీలో బెలూన్లు ఎగురవేస్తున్న డాక్టర్ కిరణ్, తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియాపై అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చునని ఖమ్మం జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్ పేర్కొన్నారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన శనివారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. తలసేమియా చిన్నారులు, పులిపాటి ప్రసాద్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్న ర్యాలీలో సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. తలసేమియా రక్తసంబంధ వ్యాధి అని, ప్రస్తుతం వ్యాధి నియంత్రణకు చికిత్స అందుబాటులోకి వచ్చిందన్నారు. అయినప్పటికీ ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకుని పిల్లలను కాపాడాలని సూచించారు. జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్, సంస్థ బాధ్యులు పొద్దుటూరి అనిత మాట్లాడగా.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్, వైద్యులు డి.నారాయణమూర్తి, లక్ష్మీదీప, సంస్థ బాధ్యులు పి.పావని, ఉదయ్‌భాస్కర్, రవిచందర్, వంశీ కిరీటి, ఎస్.ఉపేందర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఏడు జీపీల రికార్డులు స్వాధీనం

7 నుంచి ఏదులాపురం మున్సిపల్ పాలన



బారుగూడెంలో రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ షఫీఉల్లా

ఖమ్మంరూరల్: ఏదులాపురం కేంద్రంగా 12 గ్రామ పంచాయతీల విలీనంతో నూతన మున్సిపాలిటీని ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యాన శనివారం బారుగూడెం గ్రామ పంచాయతీకి సంబంధించి రికార్డులను మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణ అనుమతులు, వసూలైన పన్ను, జనరల్ ఫండ్ నిధుల జమ, వ్యయంపై రికార్డులు పరిశీలించారు. ఇప్పటివరకు ఏడు పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నామని, మిగతావి ఈ నెల 6 లోపు స్వాధీనం చేసుకుని మరుసటి రోజు నుంచే మున్సిపల్ పాలన ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

అనుమతులకు బారులు

మున్సిపల్ పాలన మొదలైతే ఇళ్ల నిర్మాణాలు, ఇతర అనుమతులు కష్టమవుతాయని, పన్నులు పెరిగే అవకాశముందనే భావనతో పలువురు జీపీ కార్యాలయాలకు పోటెత్తుతున్నారు. ఇంటి నంబర్లు, ఇంటి నిర్మాణ అనుమతులు తీసుకునేందుకు వస్తున్నారు. సాధారణ ప్రజలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం వెంచర్లకు ఇంటి నంబర్లు, ఇళ్ల నిర్మాణానికి అనుమతులు జారీ చేయాలని కార్యదర్శులను సంప్రదిస్తున్నట్లు తెలిసింది. ఈవిషయమై ఎంపీడీఓ కుమార్‌ను వివరణ కోరగా మున్సిపల్ శాఖ గెజిట్ ప్రకారం ఈ నెల 2వ తేదీ నుంచే మున్సిపల్ నిబంధనలు అమల్లోకి వచ్చాయని వెల్లడించారు. ఎవరికి కూడా అనుమతులు ఇచ్చేది లేదని, లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని స్పష్టం చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మంక్రైం: ప్రేమించాలని బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసునమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేశ్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ అదే ప్రాంతానికి చెందిన బాలికను కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఆమె చదువుతున్న పాఠశాలకు సైతం వెళ్లి బెదిరిస్తుండడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొండ చిలువను చంపిన రైతులు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో రైతులు భారీ కొండచిలువను శనివారం రాత్రి హతమార్చారు. గ్రామంలోని అముదాల చెరువు వద్ద పొలం పనులకు రైతులు వెళ్తుండగా ఎనిమిది అడుగుల పొడవుతో ఉన్న కొండ చిలువ కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన రైతులు దాన్ని హతమార్చారు.

టీజీటీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



అజ్మీరా బన్సీలాల్



బానోత్ జగ్గీలాల్

కామేపల్లి: తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీజీటీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం మండలంలోని కొత్తలింగాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోతు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా అజ్మీరా బన్సీలాల్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ జగ్గీలాల్, గౌరవ అధ్యక్షులుగా ధరావత్ ఈర్యా ఎన్నికయ్యారు. అలాగే, వివిధ పదవులకు జి.లాల్‌సింగ్, బి.రవికుమార్, బి.వీరభద్రం, హరికిషన్, కోశాధికారిగా వీరన్న, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి.కుసుమ, ఉపాధ్యక్షులుగా సోమ్లా, బోడా దస్రు, ఆంగోత్ గణేశ్, ధరావత్ బాలాజీ, బానోత్ మంగీలాల్, లాగూర్ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు



చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ వెంకటకృష్ణ కుటుంబానికి భద్రతా బీమా పరిహారం మంజూరైంది. ఈ మేరకు రూ.7,99,790 చెక్కును సీపీ సునీల్‌దత్ వెంకటకృష్ణ కుటుంబీకులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. శాఖాపరంగా అన్నివిధాలా సహకరిస్తామని తెలిపారు.

ఫోర్‌మెన్‌కు ఉద్యోగ విరమణ సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం సెక్షన్ విద్యుత్‌శాఖ ఫోర్‌మెన్ (గ్రేడ్–1)గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రాయల కోటేశ్వరరావును శనివారం సహచర ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కోటేశ్వరరావు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి వినియోగదారుల మన్ననలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ జె.ప్రభాకర్‌రావుతో పాటు సీహెచ్ బాబూరావు, హీరాలాల్, ఆనంద్‌బాబు, వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ వార్డెన్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

- విచారణ అనంతరం సస్పెండ్ చేసిన అధికారులు
- ఆగ్రహంతో హెచ్‌ఎంపై దాడి, ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: విద్యార్థులపై ఓ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని విచారణలో తేలడంతో సస్పెన్షన్ వేటు వేయగా, తనపై నిందలు వేశారంటూ హెచ్‌ఎంపై దాడి చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. సింగరేణి మండలం రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ గురుకుల పాఠశాలలో ఓ ఉద్యోగి కొద్దినెలలుగా విద్యార్థులను బలవంతంగా తన గదిలోకి పిలిపించి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని సమాచారం. బయటకు చెబితే టీసీ ఇస్తానని బెదిరిస్తుండడంతో కొన్నాళ్లు మౌనంగా ఉన్న విద్యార్థులు ఇటీవల హెచ్‌ఎం శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో వార్డెన్‌ను హెచ్‌ఎం శ్రీనివాసరావు మందలించగా ఇరువురి నడుమ వాగ్వాదం జరిగింది. ఆపై ఏటీడీఓ జహీరుద్దీన్, ఐటీడీఓ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. గత నెల 20వ తేదీన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విచారించి 30వ తేదీన సదరు ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను వెంకటేశ్వర్లుకు హెచ్‌ఎం గతనెల 31న ఇవ్వగా తీసుకోకుండా తనపై తప్పుడు నిందలు వేశారంటూ హెచ్‌ఎంపై చెప్పుతో దాడి చేశాడు. అంతేకాక గదిలోకి వెళ్లి మాత్రలను అధిక మోతాదులో మింగడమే కాక ఉరి వేసుకుంటానని అరుస్తుండటంతో అంతా కలిసి కిటికీ తలుపులు పగులకొట్టి ఆయనను ఇల్లెందు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. అయితే, తనపై దాడి చేసిన ఉద్యోగి నుంచి ప్రాణహాని ఉందని హెచ్‌ఎం శ్రీనివాసరావు శనివారం కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది.

జేసీబీ సీజ్, ట్రాక్టర్ యజమానికి జరిమానా

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వెంచర్‌కు అనుమతి లేకుండా మట్టి సరఫరా చేస్తున్న జేసీబీని అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు వాహనాన్ని శనివారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు మైనింగ్ శాఖ ఉద్యోగి సంతోష్ తెలిపారు. అలాగే, అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమానికి రూ.5,050 జరిమానా విధించారు.

ఎన్నెస్పీ కాల్వ షట్టర్ ధ్వంసం



ధ్వంసం చేసిన షట్టర్

బోనకల్: మండలంలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధి పోలంపల్లి మైనర్ కాల్వ షట్టర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయమై ఆయకట్టు రైతులు శనివారం ఇరిగేషన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. షట్టర్ తలుపులను డ్రిల్లింగ్ మిషన్‌తో ధ్వంసం చేసి ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. దీంతో మైనర్ పరిధిలో ఎగువన ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. కాగా, దిగువ ఆయకట్టు సాగుదారులే ఈ పని చేసి ఉంటారని ఇరిగేషన్ అధికారులు భావిస్తుండగా, ప్రస్తుతం సాగు అవసరాలకు ఇబ్బంది ఎదురుకాకుండా చూస్తామని తెలిపారు.

తక్షణమే వర్గీకరణ అమలు చేయాలి

ముదిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని గిద్దె గళం రథసారిధి గిద్దె రామనర్సయ్య డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యాన ముదిగొండలో శనివారం రాత్రి డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో రామనర్సయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'లక్ష డప్పులు, వేల గొంతులు' కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్‌మాదిగ, తూరగంటి అంజయ్యమాదిగతో పాటు పమ్మి రవి, వంగూరి ఆనందరావు, నూకల నాగేశ్వరరావు, పడిశాల నాగేశ్వరరావు, కట్టకూరి సురేశ్, బొడ్డు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులలో వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. గ్రామానికి చెందిన మేడ ఉప్పలమ్మ ఒంటరిగా ఉండగా, శుక్రవారం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి వచ్చిన దుండుగులు రూ.2 లక్షల విలువైన గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

వైరా: బస్సు పక్కన నిద్రిస్తున్న వ్యక్తిని డ్రైవర్ గమనించకపోవడంతో ప్రమాదం జరగగా సదరు వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వైరా పోలీస్ స్టేషన్ సమీపాన ప్రతిరోజు ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును పార్క్ చేస్తారు. శనివారం వైరా మండలం దాచాపురానికి చెందిన మోదుగు రవి (40) బస్సు పక్కన నిద్రించాడు. ఉదయం ఈ విషయాన్ని గమనించిన డ్రైవర్ బస్సును వెనక్కి తీయడంతో టైర్ల కింద పడి రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని వైరా సీఐ సాగర్‌నాయక్, ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో లష్కర్...

ఖమ్మంఅర్బన్: జలవనరులశాఖ ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఖమ్మంలోని పుట్టకోట రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎన్నెస్పీ ప్రధాన కాల్వపై కాంట్రాక్టు విధానంలో లష్కర్‌గా పనిచేస్తున్న ఎం.చంద్రయ్య (54) పుట్టకోటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమాన మూత్రవిసర్జన కోసం రోడ్డు పక్కన ఆగిన ఆయన గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. చంద్రయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బోల్తా పడిన కూలీల ట్రాలీ ఆటో



పల్టీ కొట్టిన ఆటో

వైరారూరల్: కూలీలతో వెళ్తున్న టాటా ఏస్ ట్రాలీ ఆటో టైర్ పగలడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఇద్దరికి తీవ్ర గాయాలైన ఈ ఘటన మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన సమీపాన శనివారం చోటుచేసుకుంది. చింతకాని మండలం ప్రొద్దుటూరు, తూటికుంట్లకు చెందిన 15 మంది కూలీ పనులకు టాటా ఏస్‌లో తల్లాడ మండలం రెడ్డిగూడెం వెళ్తున్నారు. మార్గమధ్యలో స్టేజీ పినపాక హైలెవల్ వంతెన వద్ద ట్రాలీ ఆటో టైర్ పగలడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్తూ పల్టీ కొట్టింది. ఈ ఘటనలో తూటికుంట్లకు చెందిన కంచర్ల మారతమ్మ, తుంగ రమ్యకు తీవ్రగాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అంకెవరపు వంశీకృష్ణ భాగ్యరాజ్ సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పట్టణంలోని పుల్లారెడ్డి వీధిలో ఓ ఇంట్లో తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన నేల చిన్నరాజు (45) అద్దెకు నివాసం ఉంటున్నాడు. చిన్నరాజు సత్తుపల్లిలోని కిన్నే ఫ్యాక్టరీలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని చిన్నరాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఎస్‌ఐ కవిత ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకి
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు
- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తే లేదు!

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకి కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబొ మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు



నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్
- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


సాక్షి సినిమా


'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.


'తంగలాన్'లో విక్రమ్


'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్


కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమేరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్


విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ–''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

సస్పెన్స్


ఆర్పీ పట్నాయక్, సురేశ్

రాంప్రసాద్, జెమినీ సురేశ్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ–''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....



ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ– ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండి తెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ